క్లుప్తంగా

ఇన్వెర్టర్ బహూకరణ

కొయ్యలగూడెం : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి ఇన్వర్టర్ సెట్‌ను బుధవారం దాతలు బహుకరించారు. కొయ్యలగూడెం గ్రామవాసి నిడదవోలు రామారావు సౌజన్యంతో రూ.21వేల విలువైన ఇన్వెర్టర్ సెట్‌ను క్లబ్ సభ్యుల సమక్షంలో అందజేశారు. అధ్యక్ష, కార్యదర్శులు ఐ.విశ్వనాథశర్మ, గొలిశెట్టి, రోటరీ వృద్ధాశ్రమ చైర్మన్ ఎం.అప్పలరాజు, ఎస్కె అమీర్‌భాష, తోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

కుక్కునూరు : ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం ఖాతాదారులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఏపీజీవీబీ ఉప్పేరు బ్రాంచ్ మేనేజర్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఇటీవల ఉప్పేరుకు చెందిన కాక పోతురాజు ప్రమాదవశాత్తు మృతి చెందడంతో నామినీగా ఉన్న కాక వెంకటమ్మకు బుధవారం ఆయన రూ.2 లక్షల బీమా చెక్కును అందించారు. బ్యాంక్ సిబ్బంది విశ్వనాథ్ రెడ్డి, పవన్, ఏపీఎం కొండయ్య, బీమా మిత్ర రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

పోలవరం రూరల్ : ఎల్ఎన్‌డీపేట గ్రామంలో అగ్నిప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన చిక్కాల వీర్రాజు కుటుంబానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరిబండి నాగరాజు ఆధ్వర్యంలో రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో గృహం మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

రాజేంద్రప్రసాద్ సేవలు అభినందనీయం



రాజేంద్రప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

టి.నరసాపురం : భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్ సేవలు అభినందనీయం అని ప్రిన్సిపాల్ శంకరరావు అన్నారు. అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాలలో భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదోన్నతిపై మచిలీపట్నం గురుకుల పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా వెళ్లిన రాజేంద్రప్రసాద్ దంపతులను బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఉప్పులూరి ప్రసాద్ బాబు, ఏటీపీ కిషోర్, ఉపాధ్యాయులు పద్మావతి, బాలు, సుబ్రహ్మణ్యం, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి



శిక్షణలో మాట్లాడుతున్న సీహెచ్ఆర్ఎం చౌదరి

జంగారెడ్డిగూడెం : విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచే కార్యక్రమంలో భాగంగా ఇన్‌స్పైర్ అవార్డు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా సైన్స్ అధికారి సీహెచ్ఆర్ఎం చౌదరి తెలిపారు. జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో కొయ్యలగూడెం విద్యాడివిజన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు బుధవారం ఇన్‌స్పైర్ మానక్ అవార్డుపై శిక్షణా నిర్వహించారు. ఈ సందర్భంగా చౌదరి ఇన్‌స్పైర్ అవార్డు ఆన్‌లైన్ ప్రక్రియ గురించి వివరించారు. రిసోర్స్ పర్సన్లు జి.సుధారాణి జి.గంగాధరరావు ఇన్‌స్పైర్ అవార్డుకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. హెచ్ఎం కె.లవకుమారి, వివిధ పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ జీవనోపాధుల మిషన్‌లో కొయ్యలగూడెం ఎంపిక



మాట్లాడుతున్న కృపామణి, అధికారులు

కొయ్యలగూడెం : జాతీయ జీవనోపాధుల మిషన్‌లో కొయ్యలగూడెం మండలం ఎంపికైన దృష్ట్యా రాబోయే అయిదేళ్లలో ప్రతి మహిళా ఆర్థికాభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించటానికి శిక్షణ నిర్వహిస్తున్నట్లు కొయ్యలగూడెం మండల సమాఖ్య అధ్యక్షురాలు తోట కృపామణి తెలిపారు. గ్రామాల్లో ప్రణాళికల రూపకల్పన కోసం ''విజన్ బిల్డింగ్'' అనే అంశంపై ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణలో భాగంగా మండల సమాఖ్య భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి కృపామణి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఏలూరు జిల్లాలో ఎంపికైన 10 మండలాల్లో కొయ్యలగూడెం కూడా ఉందని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జాతీయ స్థాయిలో శిక్షణ పొందిన కొయ్యలగూడెం వైకేపీ ఏపీఎం కె.నాగ సుబ్రహ్మణ్యం రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. మూడు రోజుల శిక్షణ అనంతరం మహిళల చేత సమగ్ర కార్యాచరణ ప్రణాళిక, వివరాణాత్మక ప్రణాళికా సిద్ధం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య కార్యదర్శి సున్నం గంగాదేవి, కోశాధికారి కనకరత్నం, జంగారెడ్డిగూడెం ఏపీఎం ఝాన్సీ, సీసీలు కృష్ణ, అన్ని గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

విత్తు మొదలు.. అమ్మకం వరకు ఒకేచోట

- సీఎం వైఎస్ జగన్ సృష్టి.. రైతు భరోసా కేంద్రం
- వ్యవసాయాన్ని పండుగ చేసేందుకు ప్రభుత్వం చర్యలు
- వేగంగా ఆర్‌బీకే భవనాల నిర్మాణాలు
- చింతలపూడి నియోజకవర్గంలో 75 భవనాల నిర్మాణం



చింతలపూడి మండలం రాఘవాపురంలో నిర్మించిన ఆర్‌బీకే భవనం

జంగారెడ్డిగూడెం : రైతులకు మెరుగైన సేవలు అందించి వ్యవసాయాన్ని పండుగ చేసేలా జగనన్న ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో రైతులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొనేవారు. పెట్టుబడులు లేక, పండించిన పంటను సరైన గిట్టుబాటు ధరకు అమ్ముకోలేక, వ్యవసాయంలో సరైన ప్రోత్సాహకం లేక రైతులు నీరసించిపోయారు. దీంతో కొందరు వ్యవసాయాన్ని వదులుకుని వేరే పనుల వైపు తరలిపోగా, మరికొందరు భూములను అమ్ముకునే స్థితికి చేరుకున్నారు. ఇటువంటి తరుణంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచి రైతులను బిడ్డల్లా సాకుతున్నారు.

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు

రైతే రాజు అనే పదానికి న్యాయం చేసేలా వ్యవసాయ రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. సాంకేతికతను మిళితం చేస్తూ ఆర్‌బీకే వ్యవస్థను ఏర్పాటు చేశారు. గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే)ను ఏర్పాటు చేసి రైతులకు సేవలను క్షేత్రస్థాయిలో అందిస్తున్నారు. విత్తు మొదలుకుని పంట అమ్ముకునేంత వరకు రైతుకు అవసరమైన అన్ని రకాల సేవలను ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యాంత్రీకరణ, పరికరాలు, వ్యవసాయ సలహాలు, సూచనలు, వ్యవసాయ శాఖసిబ్బంది క్షేత్ర స్థాయిలో పంటల పరిశీలన, మట్టి నమూనాల సేకరణ, ల్యాబ్‌ల్లో పరీక్షలు, రైతు భరోసా, పంటల బీమా, పంటల నష్టపరిహారం సీసీఆర్సీ కార్డులు తదితర ఎన్నో సేవలను గ్రామస్థాయిలోనే ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందించేందుకు నిర్దేశించింది. ఇందుకోసం ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా ఆర్‌బీకే భవనాలను ప్రభుత్వం నిర్మిస్తోంది.

వివిధ దశల్లో ఆర్‌బీకే భవన నిర్మాణాలు

చింతలపూడి నియోజకవర్గం వ్యాప్తంగా 75 ఆర్‌బీకేలను నిర్మిస్తున్నారు. వీటి నిర్మాణ పనులను ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో చేపట్టి పంచాయతీరాజ్ శాఖకు అప్పగించింది. ఒకొక్క ఆర్‌బీకే భవనం నిర్మాణానికి రూ.21.80 లక్షలు వెచ్చిస్తున్నారు. నియోజకవర్గంలో 75 ఆర్‌బీకే భవనాలకు రూ. 16.35 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే 42 భవనాలు పూర్తికాగా, కొన్ని భవనాలు ప్రారంభించి సేవలు అందిస్తున్నారు. మిగిలిన భవనాలన్నీ వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి.

ఆర్‌బీకేల వివరాలు:

నిర్మిస్తున్న మొత్తం భవనాలు	75
నిర్మాణం పూర్తయినవి	42
తుదిదశలో ఉన్నవి	10
శ్లాబ్ దశలో ఉన్నవి	5
రూఫ్ స్థాయికి చేరుకున్నవి	14
బేస్‌మెంట్‌స్థాయిలో..	3
నిర్మాణం ప్రారంభించాల్సినది	1

సాగు పరిష్కార వేదికలు ఆర్‌బీకేలు



సాగు పరిష్కార వేదికలుగా ఆర్‌బీకేలు నిలుస్తున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలతో రూపుదిద్దుకున్న ఆర్‌బీకేల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. రైతులకు విత్తు నుంచి పంట అమ్మకాల వరకు ఒకే చోట పరిష్కారం లభించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, సాగులో మెళకువలు, శాస్త్రవేత్తల సలహాలు, కొనుగోలు కేంద్రాలు ఇలా అన్ని వసతులు ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ప్రతి సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేలకు సొంత భవనాలు సైతం రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తుంది. నియోజకవర్గంలో 75కు గాను 42 నిర్మాణాలు పూర్తి చేసుకోగా, కొన్నింటిలో సేవలు కూడా అందిస్తున్నారు.
– ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, చింతలపూడి

నేడు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

కొయ్యలగూడెం : జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం గురువారం బయ్యన్నగూడెం పీహెచ్‌సీ పరిధిలో నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి విజయ్ కృష్ణ పేర్కొన్నారు. నులిపురుగులు బాలలలో ఆరోగ్యాన్ని క్షీణింజేస్తాయని, ఎదుగుదలకు ఆటంకంగా పరిణమిస్తాయన్నారు. రక్తహీనత, పోషకాహార లోపం వల్ల ఆకలి మందగించడం జరుగుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల ద్వారా నులిపురుగుల నిర్మూలనకు కృషి చేస్తుందని తెలిపారు. ఐదేళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలలో, ఆపై వయసు గల పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో ఆరోగ్య సిబ్బంది ద్వారా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

వలంటీర్ల తొలగింపు

కొయ్యలగూడెం : ప్రభుత్వం అందజేస్తున్న ఓ లబ్ధిదారుని పింఛన్‌కి సంబంధించి సొమ్ములు గోల్‌మాల్ చేసిన వ్యవహారంలో ఇద్దరు వలంటీర్లను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు తొలగించినట్లు ఎంపీడీవో ఆర్.బేబీ శ్రీలక్ష్మి బుధవారం పేర్కొన్నారు. జిల్లా నోడల్ ఆఫీసర్ రమణ, డీఎల్‌డీవో యం.రాజు నేతృత్వంలో వలంటీర్లపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించామన్నారు. పరింపూడి పంచాయతీ పరిధిలోని కొత్ర నాగమణి అనే మహిళ నుంచి అయినపర్తి వినయ్, వెత్సా పవన్ అనే ఇద్దరు వలంటీర్లు విడతల వారీగా సొమ్ములు దారి మళ్లించినట్లు విచారణలో తేలిందని చెప్పారు. సుమారు రూ. లక్షా 70 వేలు అవకతవకలకు పాల్పడ్డారన్నారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో వలంటీర్లపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఇందులో ఇతరుల ప్రమేయంపై కూడా క్షుణ్ణంగా విచారణ నిర్వహిస్తామని ఈవో సీహెచ్ సత్యనారాయణ తెలిపారు.

జాతీయ జెండాల పంపిణీ

కొయ్యలగూడెం : భారతదేశ 76వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కొయ్యలగూడెం మండలంలో జాతీయ పతాకాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తపన ఫౌండేషన్ ఆర్గనైజర్ ఆరేటి ఏసుబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బయ్యనగూడెంలో దుకాణదారులకు జెండాలను పంపిణీ చేశారు.

రెండో రోజు నామినేషన్లు నిల్

జంగారెడ్డిగూడెం రూరల్ : జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికకు రెండవ రోజు బుధవారం కూడా ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. నామినేషన్ల స్వీకరణ గురువారంతో ఆఖరి రోజు అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి. సురేష్ తెలిపారు. 19వ తేదీన శ్రీనివాసపురంలో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.

గిరిజనుల విద్య, వైద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

బుట్టాయగూడెం : ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల విద్య, వైద్య, ఆరోగ్య అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ తెలిపారు. బుధవారం తన ఛాంబర్‌లో ఎమ్మెల్యే తెల్లం బాలరాజును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యే బాలరాజు పీఓ దృష్టికి తీసుకువెళ్లారు. ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ద్వారా మోదేలు గ్రామానికి రహదారి, విద్యుత్ సదుపాయం కల్పించే విధంగా నివేదికలు తయారు చేయాలని కోరారు. అదేవిధంగా మారుమూల గ్రామాల్లో సైతం గిరిజన సంక్షేమ శాఖ ద్వారా పలు రహదారి పనులు చేపట్టడం జరిగిందని అవి పూర్తిస్థాయిలో జరిగే విధంగా కృషి చేయాలని బాలరాజు కోరారు. పీఓ మాట్లాడుతూ తాను ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల విద్య, వైద్య, ఆరోగ్య అభివృద్ధిపై దృష్టి పెడుతున్నానని చెప్పారు. ఇప్పటికే పాఠశాలల్లో తనిఖీ చేసి ప్రతీ పాఠశాలలో మెనూతోపాటు నాణ్యమైన విద్యాబోధన జరిగే విధంగా ఉపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అలాగే గిరిజనుల ఉపాధిపై కూడా కచ్చితమైన ప్రణాళికలతో ముందుకు సాగుతామని ఆయన చెప్పారు.

ప్రజల భరోసా.. సీఎం వైఎస్ జగన్

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- జంగారెడ్డిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం : రాష్ట్రంలో సంక్షేమ పాలన అద్భుతంగా కొనసాగుతోందని, ప్రజల భరోసా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం 183వ రోజు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలో ఉండగా, ప్రజాప్రతినిధులుగా తాము ప్రజల ముందుగా ధైర్యంగా వెళ్లగలుగుతున్నామంటే అందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనే కారణమన్నారు. ఈ ప్రభుత్వంలో ఎటువంటి ప్రగతిని, లబ్ధిని పొందారో ప్రజలే వివరిస్తున్నారన్నారు. మునుపెన్నడూ చూడని పాలనను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని కొనియాడారు. తాము సైతం వారి సలహాలు, సూచనలు అందుకుంటూ, ప్రజలు ఏమి కోరుకుంటున్నారో తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. గడపగడపకు కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తున్నామన్నారు. ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారని.. ఇదే ఆదరణ, ఆశీస్సులతో రాబోయే 2024 ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ అధికార పీఠం దక్కించుకుంటుందని, 175 సీట్లు సాధించడం ఖాయమన్నారు. తాండ్రపాపారాయుడు నగర్‌లో మొక్కలు నాటారు. 23, 24వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్ కంచర్ల వాసవీరత్నం, ఐసీడీఎస్ రీజనల్ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ, స్థానిక కౌన్సిలర్‌లు లోకారపు వెంకటేశ్వరరావు, దొంతు మాధవ్, పార్టీ నాయకులు బత్తిన చిన్న, సంజయ్ గౌడ్, కంచర్ల విష్ణు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అక్బర్, మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్, ఏఈ సంధ్య, మేనేజర్ రమణ, గంజి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నా భూమి – నా దేశం



కంద్రికగూడెంలో నా భూమి - నా దేశం కార్యక్రమంలో సెల్ఫీ దిగుతున్న ఎమ్మెల్యే బాలరాజు, పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం : ఆజాదీకా అమృత్ మహోత్సవ్, నా భూమి – నాదేశం, నేల తల్లికి నమస్కారం – వీరులకు వందనం కార్యక్రమం కంద్రికగూడెంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఐటీడీఏ పీఓ ఎం. సూర్యతేజ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను, వీరులను స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, సర్పంచ్ పాడియం లక్ష్మి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు కుంజా వెంకటేశ్వరరావు, ఎం. రామలక్ష్మి, ఎస్. చంద్రకళ, తెల్లం వెంకాయమ్మ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ అలీ, గిరిజన సంక్షేమ శాఖ డీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చింతలపూడి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ఆధ్వర్యంలో మండలంలోని రేచర్ల గ్రామంలో నాభూమి నా దేశం కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ వేడుకల్లో భాగంగా నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం అంటూ అధికారులు, ఉపాధి కూలీలు ప్రతిజ్ఞ చేశారు. ఎంపీపీ డా బి రాంబాబు నాయక్ ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ కె శివరామకృష్ణ, ఎంపీడీఓ మురళీకృష్ణ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : నా భూమి నా దేశం కార్యక్రమం యర్రంపేట, కుంతలగూడెం పంచాయతీల పరిధిలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి శిలాఫలకాలను ఆవిష్కరించి కార్యక్రమ ఉద్దేశం గురించి వివరించారు. పంచాయతీ గ్రామ కార్యదర్శి నజీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం మరువలేనిది

కామవరపుకోట : స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన అమరవీరుల త్యాగం మరువలేనిదని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. ఆజాదీ కా అమృత మహోత్సవంలో భాగంగా బుధవారం తడికలపూడి గ్రామ సచివాలయం పరిధిలో జెడ్పీటీసీ కడిమి రమేష్ ఆధ్వర్యంలో, కేఎస్ రామవరంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి ఆధ్వర్యంలో, కామవరపుకోటలో సర్పంచ్ కరిపోతు అనూష ఆధ్వర్యంలో నా భూమి –నాదేశం , నేలతల్లికి వందనం శిలా ఫలకం ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

జంగారెడ్డిగూడెం : వసుధ వందనం కార్యక్రమాన్ని బుధవారం జంగారెడ్డిగూడెంలోని 20వ వార్డులో నిర్వహించారు. 7వ సచివాలయం అధికారులు, సిబ్బంది సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

ఘనంగా ఆదివాసీల దినోత్సవం

కుక్కునూరు : ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని బుధవారం మండలంలో వివిధ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కుక్కునూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏటీఏ అధ్యక్షుడు చిర్రి దేవరాజు ఆదివాసీ జెండాను ఎగురవేశారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా కుక్కునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజా పంథా కార్యాలయం నుంచి ఆదివాసీలు భారీ ప్రదర్శన చేశారు. గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో బరపటి నగర్‌లో ఆదివాసీ జెండాను ఎగరవేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షులు కూరం సంజీవరావు, నాయకులు మాట్లాడుతూ జీవో నెంబర్ 3 ను చట్టం చేయాలని, 170 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.



వేలేరుపాడు : ఆదివాసీ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



చింతలపూడి : ఆదివాసీ నాయకుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న నాయక పోడులు



కుక్కునూరు : జెండాను ఆవిష్కరించిన ఆదివాసీ సంఘాల నాయకులు



పోలవరం రూరల్ : కోండ్రుకోటలో ఆదివాసీ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

రాజ్యాధికారం కోసం నాయకపోడులు పోరాడాలి

చింతలపూడి : నాయకపోడు ప్రజలు రాజ్యాధికారం కోసం పోరాడాలని ఆదివాసీ నాయకపోడు సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షులు అప్పిరెడ్డి నాగు పిలుపునిచ్చారు. యర్రగుంటపల్లి, ఖంద్రికగూడెం, కొల్లివారిగూడెం గ్రామాల్లో ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బుధవారం ఉత్సవాలు జరిపారు.

ఆదివాసి చట్టాల పరిరక్షణ కోసం ఉద్యమించాలి

కొయ్యలగూడెం : ఆదివాసీ చట్టాల పరిరక్షణకు ఉద్యమించాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.సుధాకర్ పిలుపునిచ్చారు. బుధవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సురేష్ అధ్యక్షతన కన్నాపురంలో ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. సభ అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు.

గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

బుట్టాయగూడెం : ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సీపీఐఎంఎల్ ప్రజాపందా బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బుట్టాయగూడెంలో ర్యాలీ నిర్వహించారు. నాయకులు కట్టం వీరాస్వామి మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. సంఘ నాయకులు సీహెచ్ రాజులు, సాంబయ్య, కామరాజు, చిర్పోడు రాజులు, పీఓడబ్ల్యూ డివిజన్ అధ్యక్షురాలు టి. సీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివాసీ న్యాయవాదులను ఘనంగా సత్కరించినారు. ఆదివాసీ న్యాయవాదులు కాకి జెన్నీ, శ్రావణిలను ఘనంగా సన్మానించారు. బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్ : ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాన్ని పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట గ్రామంలోని కోండ్రుకోట పునరావాస కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఐటీడీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, భాషను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. నిర్వాసితుల సమస్యలపై తీర్మానం చేసి తహసీల్దార్‌కు సమర్పించారు.

వేలేరుపాడు : ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కారం ధారయ్య బుర్రతోగు గ్రామంలో ఆదివాసి జెండా ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు పిట్టా ప్రసాద్ ఏపీజీఎస్ మండల కార్యదర్శి పిట్టా వీరయ్య, నాయకులు పాల్గొన్నారు. గిరిజన సంక్షేమ పరిషత్ కార్యాలయంలో ఆదివాసీ జెండా ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు మిరియాల శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యలపై ఆదివాసులంతా ఐకమత్యంతో పోరాడాలన్నారు.

అంబరాన్నంటిన గిరిజనుల సంబరాలు

బుట్టాయగూడెం : డోలు కొయ్యి డప్పుల వాయిద్యాలు, గిరిజన విద్యార్థుల వేషధారణ, రేల డాన్స్‌లు, సాంస్కృతిక ప్రదర్శనలతో మన్యంలో బుధవారం జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడకలు అబంరాన్నంటాయి. ప్రభుత్వ ఆదేశాలతో బుట్టాయగూడెం మండలం కోటరామచంద్రాపురం పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన గిరిజన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.



గిరిజనులతో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, పీఓ సూర్యతేజ





ఆకట్టుకున్న గిరిజన విద్యార్థుల ప్రదర్శనలు

రజకుల ధర్నా

జంగారెడ్డిగూడెం : దశాబ్దాల కాలంగా అక్కమ్మ కోనేరు రజక చెరువులో రజకులు కులవృత్తులు చేసుకుని జీవిస్తున్నారని, ఇప్పుడు అభివృద్ధి పేరుతో రజకులను వృత్తి చేసుకోకుండా అడ్డుకోవడం తగదని రజక సంఘం జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక అక్కమ్మ కోనేరు చెరువు వద్ద రజకులు కొంతసేపు ఆందోళన, ధర్నా నిర్వహించారు. రజక సంఘం పట్టణాధ్యక్షులు వడిగల శ్రీనివాస్, పాలూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

జంగారెడ్డిగూడెం : క్రీడలు మానసిక ఉల్లాసానికి ఉపయోగపడుతాయని జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్ అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలను కిషోర్ కుమార్ ప్రారంభించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి నాలుగు రోజుల పాటు వివిధ విభాగాలలో క్రీడలు నిర్వహిస్తున్నట్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు తెలిపారు. ఈ పోటీలను క్రీడా కార్యదర్శి పాశం ప్రతాప్ నిర్వహిస్తుండగా బార్ అసోసియేషన్ సభ్యులు,న్యాయవాదులు పాల్గొన్నారు.